మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

3.2.2026
మంగళవారం Monday
సంపుటి (Volume): 10
సంచిక (Issue) : 285
పేజీలు : 8
Pages : 8
వెల : 2
Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఇండియా-ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ




7

# లోక్‌సభలో తీవ్ర వివాదం

## రాహుల్ వర్సెస్ రాజ్‌నాథ్



డోక్లామ్, గాల్వాన్, అగ్నిపథ్‌పై రాహుల్ విమర్శలు

ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకంలోని అంశాల ప్రస్తావన

రక్షణమంత్రి రాజ్‌నాథ్ అభ్యంతరం.. అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం

సభా కార్యక్రమాలకు అంతరాయం.. ఆ పుస్తకమంటే ప్రధానికి భయం: రాహుల్

లేని పుస్తకంలోని అంశాలను ప్రస్తావించరాదు: రాజ్‌నాథ్

సభాగౌరవం, దేశప్రతిష్ఠకు భంగం: అమిత్ షా

సైన్యాన్ని కించపరిచేలా మాట్లాడొద్దు: కిరణ్ రిజిజు .. నేటికి సభ వాయిదా

# తెలుగు రాష్ట్రాలకు గరిష్ట ప్రయోజనం

ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు 5.10,134

హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ట్రైన్తో ప్రయోజనం

హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌తో పెనుమార్పులు

హైదరాబాద్ నుంచి రెండు గంటల్లో బెంగళూరుకు, పూణెకు

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

3





# భారత్‌కు ట్రంప్ శుభవార్త

టారిఫ్ లు తగ్గింపు

ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్ కాల్

అనంతరం ట్రూత్ సోషల్ లో పోస్టు

టారిఫ్ లు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు

.. వివరాలు 4లో



## బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు

.. వివరాలు 4లో




# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

## మీరెలా జాతిపిత? మీరు ఏ ఆదర్శాల కోసం నిలిచారు?

నేరాలపై విచారణ వద్దనడం ఏమిటి?

పోలీసులు నోటీసులిస్తే తప్పుబడతారా?

మీ హయాంలో ఉద్యమకారులకు అవమానాలు

హక్కుల కోసం కొట్లాడినోళ్లు సర్వం కోల్పోయారు

మీకేమో వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, రూ.వేల కోట్ల వ్యాపారాలు, పత్రికలు, టీవీలా?

ప్రజాస్వామ్యంలో నేరాలు చేసే స్వేచ్ఛ ఎవరికీ లేదు

రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు మోదీ కుట్ర

చదువుకున్న సర్టిఫికెట్ చూపించరెందుకు?

రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పురస్కారం



**జనతా న్యూస్, హైదరాబాద్ :** ఈ మధ్య కొంతమంది వారికి వారే 'తెలంగాణ జాతిపిత' అని ప్రకటించుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. చేసిన తప్పులకు పోలీసులు నోటీసులిస్తే.. తెలంగాణ జాతిపితకు నోటీసులిచ్చారంటున్నారని విమర్శించారు. ఆయన నిజంగా తెలంగాణ జాతిపిత అయితే.. ఆనాటి భారత జాతిపితలాగా ఏ ఆదర్శాల కోసం నిలిచారో చెప్పాలన్నారు. భారత జాతిపిత ఏదైనా పదవి తీసుకున్నారా? కుటుంబం కోసం ఏమైనా అడిగారా? అని ప్రశ్నించారు. తెలంగాణ

మిగతా 2 లో

## మునిసిపోల్స్‌లో రెబల్స్ ఉండకూడదు

### సర్వేలన్నీ సానుకూలమే

80 శాతం సీట్లలో కచ్చితంగా గెలుస్తాం..

మిగిలిన 20 శాతం సీట్లపై దృష్టి పెట్టండి

7 కార్పొరేషన్లను హస్తగతం చేసుకోవాలి

టీపీసీసీ పీఏసీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన సర్వేలు కాంగ్రెస్‌కే సానుకూలంగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ సర్వేల ప్రకారం 80 శాతం సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధించనుందని స్పష్టం చేశారు. మిగిలిన 20 శాతం సీట్లలో గట్టి పోటీ ఉందని, కష్టపడితే వాటిలోనూ సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

2

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

### బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు

### ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ చీఫ్ రామచంద్రరావు



3

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.



## బీజేపీకి 8మంది ఎంపీలున్నా రాష్ట్రానికి శూన్యం

పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి

బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు

3

రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు.

# సిట్ విచారణ ఓ ప్రహసనం..

ప్రభుత్వానికి పోలీసులు సమాచారం ఇవ్వడం సహజమే

## కేసీఆర్ హయాంలోనూ అదే జరిగింది

ఎవరి ఫోన్లు విన్నారని అడిగే సంస్కృతి కేసీఆర్‌కు లేదు

కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ అస్తిత్వాన్ని టచ్ చేసినట్లే

చంద్రబాబుకు, కేంద్రానికి రేవంత్ దాసోహం: కేటీఆర్



ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణ చేయడం ఒక రాజకీయ ప్రహసనమని, విచారణ పేరిట ఆయనను 4 గంటల 50 నిమిషాల పాటు కూర్చోపెట్టి పైశాచిక ఆనందం పొందారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

### సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు సరికాదు

చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు

ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా

కెసిఆర్ విచారణ తరవాత ప్రకటనపై హరీష్ రావు అభ్యంతరం

3

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
మంగళవారం 3 ఫిబ్రవరి 2026


# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

## సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన అక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్-కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు గానూ సోషల్ మీడియా వారియర్ శశిధర్ గౌడ్, అలియాస్ నల్ల బాలుపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మూడు కేసులను హైకోర్టు కొట్టివేసింది.

# మేడారం జాతర విజయవంతం

## ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక : మంత్రి సీతక్క వెల్లడి

**ములుగు :** మేడారం సమక్క - సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారన్ని ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం కన్నకూతురు బలి

## ముగ్గురు సంతానం నిబంధనతో ఒకరిని చంపేసిన తండ్రి

## బాలిక హత్యను ఛేదించిన నిజామాబాద్ పోలీసులు

**నిజామాబాద్ :** పంచాయితీ ఎన్నికల కోసం ఓ తండ్రి కన్నకూతురునే బలితీసుకున్నాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి తన స్వార్థం కోసం అభం శుభం తెలియని ఆరేళ్ల కూతురిని హత్య చేసిన సంఘటన కలకలం రేపుతోంది. ఈ సంఘటన నిజామాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన పాండురంగ, త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. అయితే, ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హత ఉందని పాండురంగ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ఆరేళ్ల పెద్ద కూతురు ప్రాచీని బైక్‌పై తీసుకొచ్చి నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఎఆర్‌పి శివారులో కాలువలో పడేసి చంపేశాడు. కెనాల్‌లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని బయటకు తీసి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో కన్న తండ్రే హంతకుడని తేలింది. పాండురంగ్‌తో పాటు అతనికి సహకరించిన గణెళిష్ షిండేను అరెస్ట్ చేశారు. బాలికను తీసుకువచ్చేందుకు ఉపయోగించిన బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ కేసులో మృతురాలు తండ్రి పాండురంగతో పాటు కేరూరు సర్పంచ్ గణెళిష్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# బైక్‌పై పడ్డ జేసీబీ వాహనం

## ఘటనలో బాలుడు దుర్మరణం

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. జేసీబీని తీసుకెళుతున్న ట్రక్కు.. బైక్‌పై బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మరణించాడు. బాలుడి తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ధారూరు మండలం కొండాపూర్ కలాన్ నుంచి 8 ఏళ్ల రిత్విక్ తన తండ్రి లాలయ్యతో కలిసి బైక్‌పై వికారాబాద్ వెళుతున్నాడు. బైక్ వెనకాలే స్కూటీపై రిత్విక్ తల్లి మేఘన, చెల్లెలు ఫాలో అవుతున్నారు. వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామేశ్వర ఆలయం మలుపులో ఊహించని విషాదం చోటుచేసుకుంది. జేసీబీని తీసుకెళుతున్న ట్రక్కు మలుపు వద్ద అదుపుతప్పి.. బైక్‌పై బోల్తా పడింది. దీంతో రిత్విక్ అక్కడికక్కడే చనిపోయాడు. లాలయ్య కాలు విరిగింది. స్కూటీపై వెళ్తున్న తల్లీకూతుళ్లకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే స్పందించి.. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ట్రక్కు డ్రైవర్ తాగి ఉన్నాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిత్విక్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# వేలకోట్లు కూడబెడితే ప్రశ్నించవద్దా



మొదటి పేజీ తరువాయి

అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోదుడు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ పురస్కారాన్ని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రదానం చేశారు. అంతకుముందు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు మొదలు తెలంగాణ సమాజాన్నంతా ఏకం చేసే బాధ్యత నిర్వర్తించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టించి మరీ పోలీసులతో ఈడ్చుకుపోయేంత నేరం ఆయనేం చేశారని నిలదీశారు. "మీరు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులను ఏ విధంగా అవమానించారో మర్చిపోయారా? ఇప్పుడు మీ తలుపులు ఎవరూ బద్దలు కొట్టలేదే? చేసిన తప్పులకు నోటీసులు ఇచ్చి విచారణకు రమ్మన్నారు అంతే కదా! అధికార నివాసానికి వస్తామని అధికారులంటే ఫామ్‌హౌస్‌కు వచ్చి రాసుకొమ్మంటారా? ఇదెక్కడి జాతిపిత విధానం?" అని రేవంత్ ధ్వజమెత్తారు.

### మానవతామూర్తి రావి నారాయణరెడ్డి..

రాచరిక పోకడలు, అరాచక శక్తులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధరైతాంగ పోరాటంలో నాయకత్వ స్థానాన నిలిచి పోరాడిన గొప్ప సాహసి రావి నారాయణరెడ్డి అంటూ సీఎం రేవంత్ కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం 500 ఎకరాలు దానం చేసిన మానవతామూర్తి అని అన్నారు. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రజలకు స్ఫూర్తినిస్తూ.. పార్టీ, రాజకీయ పదవుల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగిన గొప్పనేత రావి నారాయణరెడ్డి అని శ్లాఘించారు. ఆయన త్యాగాలు ఆదర్శనీయమని, ఆయన ఔన్నత్యాన్ని భావితరాలకు చాటేలా మంచి కార్యక్రమాలు చేపట్టే బాధ్యత తమ ప్రభుత్వానిదని ప్రకటించారు. "ప్రపంచంలో ఎక్కడైనా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మానవ హక్కుల కోసం కొట్లాడిన చేగువేరా మొదలు రావి నారాయణరెడ్డి వరకు ఎంతోమంది సర్వం కోల్పోయారు. ఆస్తులు, అంతస్తులు త్యాగం చేశారు. అలాంటి త్యాగధనులను జాతిపితలుగా, ఉద్యమకారులుగా ప్రజలు కీర్తించారు. అంతేతప్ప.. వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో పదవులన్నీ మీరే తీసుకుంటిరి. వందల ఎకరాల ఫామ్‌హౌసులు మీకే వచ్చె. టీవీలు, పత్రికలు, వేలకోట్ల రూపాయల వ్యాపారాలు మీకే వచ్చె. చేయాల్సిన తప్పులన్నీ మీరే చేస్తిరి. కాంట్రాక్టులు మీరే పంచుకుంటిరి. ఇంత చేసిన తర్వాత మీరెట్లా జాతిపిత అయితరు? ఉద్యమకారుడెలా అయితరు?" అని రేవంత్ అన్నారు.

### నేరాలను విచారించొద్దు అనడమేంటి?

"ఒక అసెంబ్లీ స్థానంలో ఓడిపోయినప్పుడు, పార్లమెంటు ఎన్నికల్లో మీకు ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వనప్పుడు మీరు ప్రజల తిరస్కరణకు గురయ్యారు. దీన్ని అర్థం చేసుకోకుండా మీకు ఓట్లు వేయకుండా ప్రజలే తప్పు చేశారని వారిపై నిందలు మోపడానికి ప్రయత్నిస్తే... ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదెక్కడి ఉద్యమకారుడి ఆలోచన? ప్రజలు తిరస్కరించినందున హుందాగా ప్రజాక్షేత్రం నుంచి తప్పుకొంటామని ముందుకు వచ్చి ప్రకటిస్తే కొంతైనా మీకు గౌరవం నిలబడుతుంది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఉంటుంది కానీ, నేరపూరితమైన పనులు చేయడానికి, ఆ నేరాలను విచారించవద్దనడానికి స్వేచ్ఛ లేదు. అధికారంలో ఉన్నప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రజాస్వామ్యంలో విచారణ తప్పదు" అని సీఎం రేవంత్ అన్నారు. శిబుసోరెన్, లాలూ ప్రసాద్, జయలలిత, యడ్యూరప్ప లాంటి మాజీ సీఎంలు విచారణ ఎదుర్కోలేదా? అని ప్రశ్నించారు. చట్టాలకు ఎవరమూ అతీతులం కాదన్నారు. తాను హార్వర్డ్‌కు వెళ్లినా రాష్ట్ర రాజకీయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నానని తెలిపారు.

### రాజ్యాంగాన్నే రద్దు చేయాలన్న కుట్ర...

నాణేనికి రెండు వైపులు ఎలాగో.. ప్రజలకు కూడా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అంతే అవసరమని సీఎం రేవంత్ అన్నారు. కానీ, ప్రస్తుతం మోదీ లాంటి వాళ్లు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్ అంటున్నారని, ఈ పేరుతో వన్ పర్సన్ - వన్ పార్టీ విధానాన్ని దేశంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ 400 సీట్లు అడిగింది రాజ్యాంగంలో మార్పులు తేవడానికి కాదని, రాజ్యాంగాన్నే రద్దు చేయడానికని ఆరోపించారు. అయితే ప్రజలు సింపుల్ మెజారిటీ కూడా ఇవ్వకుండా తెలివిగా వ్యవహరించి ఆ పార్టీని నియంత్రించారని తెలిపారు. ఇప్పుడు.. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలన్న కుట్ర జరుగుతోందన్నారు. "ఈరోజు అనవసరమైనవి ఎన్నో అడుగుతున్నారు. మీ తాత ముత్తాతలు ఎక్కడ పుట్టారో ఆధారాలు చూపించమంటున్నారు. దీనిపై రాహుల్‌గాంధీ ఒకే ఒక్కటి అడిగారు. 'మోదీగారూ మీరు చదువుకున్న సర్టిఫికెట్ చూపించండి' అని. అది మాత్రం ఆయన చూపించరట. చదువుకున్నది నిజమైనప్పుడు సర్టిఫికెట్ చూపించానికి వచ్చిన సమస్య ఏంటి? మీరు చదువుకున్న సర్టిఫికెటే ఒక రహస్యమైనప్పుడు.. చదువురాని నిరుపేదలపై నిబంధనలు రుద్ది వాళ్ల ఓటు హక్కును కాలరాయాలని చూడడం దుర్మార్గం కాదా? రాజ్యాంగంపై దాడి జరుగుతోంది. దీనిపై మనమంతా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి" అని రేవంత్ అన్నారు.

### పరిమితుల్లేని భావప్రకటనా స్వేచ్ఛకు అనుమతి లేదు..

ఇప్పటివరకు తాను అందుకున్న పురస్కారాలన్నింటి కన్నా రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు అత్యంత విలువైనది, ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తున్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'భారత రాజ్యాంగం - భావప్రకటనా స్వేచ్ఛ' అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. రావి నారాయణరెడ్డి రాసిన 'తెలంగాణ నగ్నసత్యం' చారిత్రక పత్రంపై విశ్వవిద్యాలయాలు కేంద్రంగా పరిశోధన జరగాలన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు భావప్రకటనా స్వేచ్ఛ అని, అయితే పరిమితులు లేని భావప్రకటనా స్వేచ్ఛను అనుమతించలేదని చెప్పారు. ఇందుకు సంబంధించి 1951, 1963ల నాటి రాజ్యాంగ సవరణల్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, సీపీఐ నాయకులు కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రావి నారాయణరెడ్డి మనుమరాలు ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మునిసిపోల్స్‌లో రెబల్స్ ఉండకూడదు

## సర్వేలన్నీ సానుకూలమే

## 80 శాతం సీట్లలో కచ్చితంగా గెలుస్తాం..

## మిగిలిన 20 శాతం సీట్లపై దృష్టి పెట్టండి

## 7 కార్పొరేషన్లను హస్తగతం చేసుకోవాలి

## టీపీసీసీ పీఏసీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 :** మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన సర్వేలు కాంగ్రెస్‌కే సానుకూలంగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ సర్వేల ప్రకారం 80 శాతం సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధించనుందని స్పష్టం చేశారు. మిగిలిన 20 శాతం సీట్లలో గట్టి పోటీ ఉందని, కష్టపడితే వాటిలోనూ సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై జరిగే ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పని చేయాలని పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులకు సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాదిరిగానే మునిసిపల్ ఎన్నికలనూ సవాల్‌గా తీసుకుని గెలిపించుకుందామన్నారు. ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న 7 కార్పొరేషన్లూ కాంగ్రెస్ ఖాతాలో చేరాల్సిందేనన్నారు. కొన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సమస్యలున్నాయని, వాటిపై ఇన్‌చార్జి మంత్రులతో వ్యక్తిగతంగా మాట్లాడతానని చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగియనుండగా.. ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాకు ఆమోదం తెలపాల్సిన నేపథ్యంలో సోమవారం టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, ఎన్నికల కమిటీలు జూమ్ ద్వారా భేటీ అయ్యాయి. ఈ భేటీలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, ఎన్నికల కమిటీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికల్లో రెబల్ అభ్యర్థులు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల్లో చాలా చోట్ల రెబల్ అభ్యర్థుల కారణంగా ప్రత్యర్థి పార్టీలు గెలిచాయని గుర్తు చేశారు. అసంతృప్త నేతలతో భేటీ అయి నచ్చజెప్పాలని, నామినేటెడ్ పోస్టులపై హామీలు ఇవ్వాలన్నారు. నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలన్నారు. అన్ని సమస్యలనూ పరిష్కరించుకుని ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీని తేలికగా తీసుకోవద్దని, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలపై గట్టిగా దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. కొన్ని చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ నాయకత్వాలు సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నాయన్న అంశమూ చర్చకు వచ్చినట్లు సమాచారం. కాగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అభ్యర్థుల ఎంపికలో ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలన్నారు.

### అభ్యర్థుల జాబితాకు ఆమోదం

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఏర్పాటైన స్క్రీనింగ్ కమిటీలు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాలను టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమోదించారు. అభ్యర్థులకు బీ ఫారాలు జారీ చేయడానికి డీసీసీ అధ్యక్షులకు ఆథరైజేషన్ ఇస్తూ తీర్మానించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచే బీఫారాల పంపిణీ ప్రారంభమైంది. సమస్యలు ఉన్న చోట్ల పరిష్కారం చూపిన తర్వాత బీ ఫారాలను జారీ చేయనున్నారు.

### సీఎంకు పీఏసీ సభ్యుల అభినందనలు

హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి పట్టా పొందిన సీఎం రేవంత్‌రెడ్డిని పీఏసీ సమావేశంలో మంత్రులు, సభ్యులు అభినందించారు. సీఎం హోదాలో ఉండి హార్వర్డ్ వర్సిటీకి వెళ్లి కోర్సును దిగ్విజయంగా పూర్తి చేసి.. పట్టా పొందడం ద్వారా విద్య విషయంలో రాష్ట్రంలోని యువతకు ఒక సందేశాన్ని ఇచ్చారని కొనియాడారు.

### నేడు ఇన్‌చార్జి మంత్రులతో భేటీ

పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జిల(మంత్రుల)తో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం భేటీ కానున్నారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగే సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సైతం పాల్గొననున్నారు. మీటింగ్ సమయానికి ఏయే కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో తిరుగుబాటు అభ్యర్థులు బరిలో ఉన్నారు.. ప్రత్యర్థి పార్టీల బలాబలాలు ఎలా ఉన్నాయి.. అనే అంశాలపై సమగ్ర సమాచారంతో రావాలని ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ చీఫ్ సూచించారు. తిరుగుబాటు అభ్యర్థులపై సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సీఎం రేవంత్ ప్రచార షెడ్యూల్‌పై చర్చించనున్నారు.

# సిట్ విచారణ ఓ ప్రహసనం..

**ప్రభుత్వానికి పోలీసులు సమాచారం ఇవ్వడం సహజమే**

**కేసీఆర్ హయాంలోనూ అదే జరిగింది**

**ఎవరి ఫోన్లు విన్నారని అడిగే సంస్కృతి కేసీఆర్‌కు లేదు**

**కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ అస్తిత్వాన్ని టచ్ చేసినట్లే**

**చంద్రబాబుకు, కేంద్రానికి రేవంత్ దాసోహం: కేటీఆర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణ చేయడం ఒక రాజకీయ ప్రహసనమని, విచారణ పేరిట ఆయనను 4 గంటల 50 నిమిషాల పాటు కూర్చోపెట్టి పైశాచిక ఆనందం పొందారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఏ ప్రభుత్వానికైనా పోలీసులు సమాచారం ఇవ్వడం సహజమని, కేసీఆర్ హయాంలోనూ అదే జరిగిందన్నారు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో నాడు కేసీఆర్ ప్రభుత్వానికీ అలాగే వచ్చిందన్నారు. ఎవరి ఫోన్ విన్నావని అడిగే సంస్కృతి కేసీఆర్‌కు లేదని, చట్టబద్ధంగానే అన్నీ జరిగాయని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు పాత అంశాన్ని మళ్లీ మళ్లీ తెరపైకి తెస్తోందని విమర్శించారు. మీడియా కూడా ప్రభుత్వ అబద్ధాలను యథాతథంగా ప్రచురించడం మానుకోవాలని కోరారు. కేటీఆర్ సోమవారం నందినగర్ నివాసంలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరుగుతుందో అధికారులు బయట ఉన్న కాంగ్రెస్ నాయకులకు లీకులు ఇస్తున్నారని, ముఖ్యమంత్రి కార్యాలయానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపుల్లో కూడా ఇలాంటి అబద్ధపు ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. ఈ కేసు విషయంలో 'ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్' అంటూ సజ్జనార్ ట్వీట్ చేయడం హాస్యాస్పదమని, ఆయన జడ్జిలా తీర్పునివ్వడం తగదని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని, ఆయనను ముట్టుకుంటే తెలంగాణ అస్తిత్వాన్ని ముట్టుకున్నట్లేనని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను విచారణకు పిలవడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనన్నారు. ఈ విషయంలో రాసిన ఆయనకు ఏమన్నా అనుమానాలు ఉండొచ్చు కానీ ప్రజలకేం లేవని, వారికి స్పష్టత ఉందన్నారు. ఇవాళ రాజకీయం ఎలా జరుగుతోందంటే పరిపాలనా వైఫల్యాలపై మీడియాలో కూడా చర్చలేదన్నారు.

### తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు

కృష్ణా ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి తన పాతబాస్ చంద్రబాబుకు, కేంద్రానికి దాసోహం అవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత కేసుల నుంచి బయటపడేందుకు రాష్ట్ర నీటి వాటాను తాకట్టు పెడుతున్నారన్నారు. తెలంగాణ జుట్టు కేంద్రం చేతుల్లో ఉందని, అందుకే రేవంత్ రెడ్డి నోరు మెదపలేకపోతున్నారని విమర్శించారు. సింగరేణి బొగ్గుగనుల టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి భారీ అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన కాల్ డాటా తీస్తే అడ్డంగా దొరికిపోతారన్నారు. సింగరేణి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయని, అందుకే వాస్తవాలు బయటికి రావడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో భూముల దోపిడీ జరుగుతోందని, అధికార పార్టీ నాయకులు బౌన్సర్ల సంస్కృతిని ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వంపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు విచారణలకు భయపడతారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం అవాస్తవమని, తమ నాయకత్వం ఎప్పుడూ చట్టాన్ని గౌరవిస్తూ ప్రశ్నలను ఎదుర్కొన్నదేనన్నారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

**చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**

**ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా**

**కెసిఆర్ విచారణ తరవాత ప్కటనపై హరీష్ రావు అభ్యంతరం**

**హైదరాబాద్,ఫిబ్రవరి2 :** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నొసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సీట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.



# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

**బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు**

**ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి2 :** గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు.

హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని

గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# బీజేపీకి 8మంది ఎంపీలున్నా రాష్ట్రానికి శూన్యం

**పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి**

**బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు**



**జయశంకర్ భూపాలపల్లి :** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బ్జడెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్-2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ , నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి , పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.


# మేం గేట్లు తెరిస్తే బిఆర్ఎస్‌లో ఎవ్వరూ మిగలరు

**మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి2 :** మేం గేట్లు ఓపెన్ చేస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డిని కాదని కేసీఆర్ దగ్గరికి వెళ్లే నేతలు ఎవరూ ఉండరని మంత్రి స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని కేసీఆర్ అనడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్.. పదేళ్లలో కాంగ్రెస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తాము రెండేళ్లలో బీఆర్ఎస్ నేతలపై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదన్నారు. అక్రమంగా దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. తప్పు చేయకపోతే విచారణకు సహకరించాలి తప్ప.. భయపడటం ఎందుకని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో దుర్మార్గాలు జరిగాయన్నారు. అవన్నీ బయటపడాల్సి ఉందన్నారు.

# కులం కాదు..గుణం చూసి ఓటేయండి

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం : కవిత**



**హైదరాబాద్,ఫిబ్రవరి2 :** మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
మంగళవారం 3 ఫిబ్రవరి 2026


# భారత్‌కు ట్రంప్ శుభవార్త

**టారిఫ్ లు తగ్గింపు.. ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్ కాల్**

**అనంతరం ట్రూత్ సోషల్ లో పోస్టు**

**టారిఫ్ లు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు**



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ ల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్ పై ఇంతకుముందు విధించిన ప్రతీకార టారిఫ్ లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడిన అనంతరం ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతకీ ట్రంప్ తన ప్రకటనలో ఏమని పేర్కొన్నారంటే... "ఈ ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. మోదీ నా గొప్ప స్నేహితుల్లో ఒకరు. ఆయన భారత్ లో అత్యంత శక్తిమంతమైన నేత. మేం ఇవాళ ఫోన్ కాల్ లో చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు మోదీ అంగీకరించారు. అమెరికా నుంచి, దాంతో పాటే వెనెజువెలా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలుకుతుందని ఆశిస్తున్నాను. ప్రతి వారం వేలమంది చనిపోతున్న ఆ యుద్ధానికి ఈ నిర్ణయం చరమగీతం పాడుతుందని అనుకుంటున్నాను. మోదీతో స్నేహం, గౌరవం ఇవన్నీ కాకుండా... ఆయన విజ్ఞప్తి మేరకు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపాం. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 25 శాతం టారిఫ్ లు 18 శాతానికి తగ్గుతాయి. అదే సమయంలో భారత్ వైపు నుంచి కూడా టారిఫ్ లు తగ్గుతాయనుకుంటున్నాను. దాంతోపాటే, పూర్తి పన్ను రహిత వాణిజ్యానికి ద్వారాలు తెరుచుకుంటాయని ఆశిస్తున్నాను. అమెరికా తయారీ వస్తువుల కొనుగోలు పట్ల కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ మాటిచ్చారు. ఈ వాణిజ్యం దాదాపు 500 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు. ఇందులో ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు తదితర ఉత్పత్తులు ఉన్నాయి. భారత్ తో అమెరికా అద్భుతమైన సంబంధాలు మరింత దృఢంగా ముందుకు వెళతాయి. నేను, ప్రధాని మోదీ ఈ ఒప్పందానికి ఓ రూపం కల్పించాం... ఇంతకుమించి ఎక్కువగా చెప్పలేం" అంటూ ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు.

# బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

**ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు**

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేథం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.

# చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

**సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం**



**న్యూఢిల్లీ :** ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బౌ ్లజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

# లోక్‌సభలో తీవ్ర వివాదం

**రాహుల్ వర్సెస్ రాజ్‌నాథ్**

**డోక్లామ్, గాల్వాన్, అగ్నివీర్పై రాహుల్ విమర్శలు**

**ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకంలోని అంశాల ప్రస్తావన**

**రక్షణమంత్రి రాజ్‌నాథ్ అభ్యంతరం**

**అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం**

**సభా కార్యక్రమాలకు అంతరాయం**

**ఆ పుస్తకమంటే ప్రధానికి భయం: రాహుల్**

**లేని పుస్తకంలోని అంశాలను ప్రస్తావించరాదు: రాజ్‌నాథ్**

**సభాగౌరవం, దేశప్రతిష్ఠకు భంగం: అమిత్ షా**

**సైన్యాన్ని కించపరిచేలా మాట్లాడొద్దు: కిరణ్ రిజిజు**

**నేటికి సభ వాయిదా**



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో సోమవారం రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చ సమయంలో తీవ్ర వివాదం చోటు చేసుకుంది. మాజీ సైనిక చీఫ్ జనరల్ ఎమ్ఎమ్ నరవానే రాసిన అప్రకటిత స్మృతి గ్రంథం నుంచి భారత్-చైనా సరిహద్దు ఘర్షణలను(డోక్లాం, గాల్వాన్) కాంగ్రెస్ నేత, లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఉదహరిస్తుండగా, రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరెన్ రిజిజు కూడా జోక్యం చేసుకోవడంతో తీవ్ర గొడవ జరిగింది. చివరికి ప్రధాని నరేంద్ర మోడీ సభలో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్కు కాంగ్రెస్ సభ్యులు మద్దతు ఇచ్చారు. తీవ్ర వాదనలు, ఆందోళనల మధ్య సభమూడుసార్లు వాయిదా పడింది. చివరికి మంగళవారానికి వాయిదా పడింది. ఈ వివాదం మాజీ సైనిక చీఫ్ నరవానే గ్రంథంపై మరింత దృష్టిని ఆకర్షించింది. ఈ గ్రంథం ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ అని పేరు. ఇంకా ప్రచురితం కాలేదు. కానీ కారవాన్ మ్యాగజైన్లో దీని భాగాలు ప్రచురిత మయ్యాయి. ఇది భారత్-చైనా సరిహద్దు సమస్యలు, అగ్నిపథ్ స్కీమ్ వంటి అంశాలపై ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకమంటే మోడీకి భయం**

లోక్సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవా దాల తీర్మానం పై చర్చ సమ యంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసం గాన్ని విన్న తర్వాత తన అనుభవాన్ని చెప్పా రు. ఖర్గేజీ తో(కాంగ్రెస్ చీఫ్) పాటు కూర్చుని విన్నాను. దానిపై దృష్టి పెట్టి వినడానికి చాలా కష్టపడ్డాను. ఎందుకంటే గతంలో కూడా ఇలాంటి ప్రసంగాలే విన్నాను. అంతకు ముందు కూడా ఇలాంటి ప్రసంగా న్నే విన్నాను. యువత ఉద్యో గాలు లేకుండా ఉన్నారు. దేశంలో నిజమైన సమస్యల పట్ల అంధ త్వాన్ని బడ్జెట్ ప్రదర్శిం చిందని, దిద్దుబాటు లేదని విమర్శించారు. మాన్యుఫాక్చరింగ్ పతనం, కుటుంబా ల సేవింగ్స్ తగ్గడం, రైతు ల ఇబ్బందులు పెట్టు బదుల ఉపసం హరణ వంటి అంశాలను బడ్జెట్ పట్టించు కోలేదని అన్నాడ ఖీరు. దేశభక్తి, నేషనలిజం విషయం లో ముందు మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్విసూర్య ఆరోపణలకు స్పందిస్తూ, కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నించవద్దని చెప్పారు. మా దేశభక్తి సమాధానం కాలేదు అని అన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, నరవానే స్మృతి గ్రంథంలోని భాగాలను ఉదహరిం చడం ప్రారంభిం చారు. ఈ గ్రంథం ఇంకా ప్రచురి తం కాలేదు. కానీ కారవాన్ మ్యాగ జైన్లో దీని గురించి ఒక ఆర్టికల్ వచ్చింది. ఈ గ్రంథంలో డోక్లాం, గాల్వాన్ ఘర్షణల సమ యంలో ప్రభుత్వ నిర్ణయా లు, అగ్నిపథ్ స్కీమ్ గురించి నర వానే వ్యాఖ్యలు ఉన్నాయని రాహుల్ చెప్పారు. పార్ల మెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ, రాజ్నాథ్ సింగ్ భయపడు తున్నారు. ఎవరూ ఆపలేరు (పుస్తకం ఆవిష్కరణ) అనే ఆ ఒక్క లైన్ చెప్పాలనుకుంటున్నాను. మాజీ ఆర్మీ చీఫ్ గ్రంథానికి ప్రభుత్వం భయపడు తోంది అని విమర్శించారు

**సైన్యాన్ని కించపరిచేలా మాట్లాడొవద్దు మంత్రి కిరెన్ రిజిజు**

రాహుల్ గాంధీ మొదటి నుంచే నియమాలను ఉల్లంఘించారు. స్పీకర్ రూలింగ్ ఇచ్చిన తర్వాత కూడా అదే విష యాన్ని పదేపదే పునరా వృతం చేసి సభ సమయాన్ని వృథా చేశారు. సభ నియమా ల ప్రకారం అప్రకటిత గ్రంథం లేదా మ్యాగజైన్ ఆర్టికల్ను ఉదహరించడం తప్పు. ఇది ఇంకా పబ్లిష్ కాలేదు, దాని ప్రామాణికత స్పష్టంగా లేదు. స్పీకర్ ఇప్పటికే రూలింగ్ ఇచ్చారు. అయినా రాహుల్ గాంధీ పదేపదే అదే విషయాన్ని లేవనెత్తుతున్నారు. ఇలా చేస్తే సభ ఎలా నడుస్తుంది? మనమందరం ఇక్కడ రాహుల్ గాంధీ మాటలు వినడానికి వచ్చాము, ప్రధాని కూడా ఇక్కడే ఉన్నారు. కానీ నియమాలు పాటించాలి. దేశాన్ని చెడుగా చూపించడం ద్వారా ఏమి సాధిస్తారు? దేశాన్ని చెడుగా చూపించడం ద్వారా రాహుల్ గాంధీ ఏమి పొందుతారు? మన మధ్య విభేదాలు ఉండ వచ్చు, కానీ జాతీయ ప్రయోజనాల కోసం అందరూ కలిసి ఉండా లి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆయ న(రాహుల్ గాంధీ) మాట్లాడుతు న్నారు. స్పీకర్ రూలింగ్ను పాటించని సభ్యుడితో ఎలా వ్యవహ రించాలో కూడా చర్చించాలి. తన స్థానాన్ని రాహుల్ గాంధీ తగ్గించు కున్నారు. స్పీకర్ ఆదేశాన్ని ఉల్లంఘించడం పార్లమెంట్ గౌరవాన్ని తగ్గిస్తుంది.

**సభా గౌరవానికి, దేశ ప్రతిష్ఠకు భంగం**

మ్యాగజైన్ ఏమైనా రాయవచ్చు. బుక్ పబ్లిష్ కాలేదని ఆయన (రాహుల్) స్వయంగా చెప్పారు. ఇది చర్చను ముగించడమే. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ చర్చను చేపట్టింది. సంబంధం లేని విషయాలను అనుమ తించకూడదు అని అమిత్ షా అన్నారు. భారత్-చైనా సరిహ ద్దు సమస్యలు, డోక్లాం, గాల్వాన్ గురించి మాట్లాడుతూ పుస్తకాన్ని రాహుల్ గాంధీ ఉదహరించడంపై హోం మంత్రి మాట్లాడుతూ ఇది సంబంధం లేని విషయం. మ్యాగజైన్ రిపోర్ట్ మాత్రమే, బుక్కాదు. దాన్ని ఆధారంగా తీసుకోవడం సరికాదు అని తెలిపారు. తేజస్వీ సూర్య (బీజేపీ ఎంపీ) ప్రసంగంపై రాహుల్ ఆరోపణలపై స్పందిస్తూ తేజస్వి సూర్య ఆ ప్రసంగంలో విపక్ష పాత్ర లేదా దేశభక్తిని ప్రశ్నించలేదు. అది 2004-2014 కాలంలో జాతీయవాదం, సంస్కృతి, భాష గురించి మాట్లాడారు. ఇలాంటి అప్రకటిత మెటీరియల్ను ఉపయో గించకుండా ఆపాలి. ఇది సభ గౌరవానికి, దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుంది అని స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి అమిత్ షా విజ్ఞప్తి చేశారు.

**సభా నియమాలకు విరుద్ధం**

ఈ గ్రంథం (బుక్) ప్రచురితమైందా? ఇంకా లేదు. సభా నియమాల ప్రకారం అప్రకటిత గ్రంథం లేదా మ్యాగజైన్ ఆర్టికల్ను ఉదహరించడం తప్పు. సభ ఎదుట ఆ పుస్తకాన్ని లోక్సభలో విపక్షనేత (రాహుల్ గాంధీ) సమర్పించాలి. ఎందుకంటే ఆ బుక్ ఇంకా పబ్లిష్ కాలేదు. ఇది సభా నియ మాలకు విరుద్ధం. ఇది మ్యాగజైన్లో వచ్చిన ఆర్టికల్ మాత్రమే, పూర్తి బుక్ కాదు. దాన్ని ఆధారంగా అప్రకటిత మెటీరియల్ను ఉపయోగించ తీసుకోవడం సరికాదు. ఇలాంటి కుండా ఆపాలి. ఇది సభాకార్యక లాపాలకు సంబంధం లేని విషయం అని స్పీకర్ ఓం బిర్లాకు రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు

# తెలుగు రాష్ట్రాలకు గరిష్ట ప్రయోజనం


**ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు 5.10,134**

**హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ట్రైన్తో ప్రయోజనం**

**హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌తో పెనుమార్పులు**

**హైదరాబాద్ నుంచి రెండు గంటల్లో బెంగళూరుకు, పూణెకు**

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్‌కి ఈ బడ్జెట్లో రూ. 10,134 కోట్లను రైల్వేకి కేటాయించామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏపీకి రైల్వే కారిడార్ గేమ్ ఛేంజర్గా తుందన్నారు. రాష్ట్రంలో మొత్తం రూ. 92,649 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అన్నారు. చెన్నై -హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ ఏపీకి కూడా ఎంతో ఉపయోగపడు తుందని, రాష్ట్రం ఇప్పటికే 100 శాతం ఎలక్ట్రిఫైడ్ రైల్వే లైన్లు కలిగిన రాష్ట్రంగా నిలిచిందని గుర్తు చేశారు. అలాగే కోల్కతా - చెన్నై మధ్య నాలుగు రైల్వే లైన్లు ఏర్పాటు పూర్తయ్యాయని వెల్లడించారు. దేశంలో ఇకపై హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో పరుగులు పెడతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళు వేస్తామన్నారు. దీనితో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో, పుణెకు 1.55 గంటల్లో, చెన్నైకు 2.55 గంటల్లో చేరుకోవచ్చన్నారు. హైస్పీడ్ కారిడార్తో ఏపీ-తెలంగాణ-తమిళనాడు మధ్య ఆర్థిక, వైద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. హైస్పీడ్ రైళ్లు తెలుగు రాష్ట్రాలకు గేమ్ ఛేంజర్గా మారతాయి అని వైష్ణవ్ తెలిపారు. అలాగే అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో రూ. 72,468 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు చేపడతామని అన్నారు. ప్రస్తుతం కొత్త రైల్వే ప్రాజెక్టులు, వంతెనల గురించి సర్వే జరుగుతోందన్నారు. భూటాన్కు అనుసంధాన ప్రాజెక్టులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**ఈశాన్య రాష్ట్రాలపై గురి**

బెంగాల్ లోని సిలిగురి మీదుగా ఈశాన్య ప్రాంతాన్ని భారత్తో కలిపే ఈ ఇరు కైన భూభాగాన్ని చికెన్స్ నెక్ అని పిలుస్తారు. ఇది భారత్కు చాలా వ్యూహాత్మక ప్రాంతం. అందుకే భారత్తో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానం చేసేందుకు 40 కి.మీ మేర భూగర్భ రైల్వే ట్రాకుల నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక వేసిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం బెంగాల్లో ని 40 కి.మీ వ్యూహాత్మక కారిడార్లో భూగర్భ రైల్వే ట్రాకులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ కారిడార్ ఈశాన్య భారత దేశాన్ని దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానిస్తుందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ ప్రధాన భూభాగంతో కలిపే 40 కి.మీ వ్యూహాత్మకకారిడార్ కోసం ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. అక్కడ భూగర్భ రైల్వే ట్రాక్లను నిర్మించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న ట్రాక్లను నాలుగు లైన్ల మార్గాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం అన్నారు.

**తెలంగాణకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం : కేంద్ర మంత్రి**

తెలంగాణకు ఈసారి రూ.5,454 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించామని, రాష్ట్రంలో మొత్తం రూ.48 వేల కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

హైదరాబాద్ నుంచి బెంగళూరు, పుణె, చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నాయని చెప్పారు. అలాగే ముంబై- హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ తమకు అనేక విలువైన అనుభవాలను అందించనుందన్నారు. చెన్నై హైదరాబాద్, బెంగళూరు-హైదరాబాద్, చెన్నై- బెంగళూరు మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ఉన్నాయని, అది డైమెంట్ రూపంలో ఉండనుందని వెల్లడించారు. నాలుగు రాష్ట్రాలకు ఇది కీలకం కాబోతుందన్నారు.

# ఐసీసీ ఆంక్షలకు భయపడం..

## భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నాం

## భవిష్యత్తులోనూ భారత్‌తో ఆడం

## పాక్ టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. 'భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ భారత్ రావడానికి నిరాకరించినప్పుడు ఐసీసీ తేలికగా తీసుకుంది. కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం మారిపోయింది. గతంలోలా కాకుండా బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరించనుంది. ఐసీసీ ఆంక్షలు, మ్యాచ్ ఓటమి గురించి పీసీబీ ఆందోళన చెందడం లేదు. సాధారణంగా పీసీబీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోదు. చాలా ఆలోచించిన తర్వాతే ఈ అడుగు వేశారు. ఫిబ్రవరి 15 జరిగే మ్యాచ్‌తోనే ఇది ఆగిపోదు. మహిళల వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ 2028లో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాక్ ఇలానే బహిష్కరించనుంది. అయితే వ్యాపారవేత్తలు ప్రభుత్వాలను శాసిస్తారు. బ్రాడ్‌కాస్టర్లు ఊరుకోరు కాబట్టి ఏదో ఒక పరిష్కారం వెతుకుతారు. దౌత్యపరంగా ఏదో పరిష్కారం చూపించే ప్రయత్నం జరగవచ్చు.'అని ఆయన రషీద్ లతీఫ్ చెప్పుకొచ్చాడు.

# మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తే పాక్‌కు చుక్కలే

తమ జట్టు 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటుందని, అయితే ఫిబ్రవరి 15న శ్రీలంకలో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం మైదానంలోకి దిగదని పాకిస్తాన్ ప్రభుత్వం గత ఫిబ్రవరి 01న అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత క్రికెట్ ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్ తెలివి తక్కువగా ఇంత పెద్ద ప్రకటన చేసింది, కానీ దీనివల్ల కలిగే నష్టాన్ని వారు ఊహించలేదు అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్‌కు 5 పెద్ద నష్టాలు ఉన్నాయి. దైనిక్ జాగరణ్ ప్రకారం, పాకిస్తాన్ ఈ నిర్ణయం ప్రకటించడం అంటే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు ప్రపంచ కప్ నుండి ఆ జట్టుపై నిషేధం పడవచ్చు. టోర్నమెంట్ నుండి బంగ్లాదేశ్ ఇప్పటికే తన పిచ్చి నిర్ణయం కారణంగా నిష్క్రమించింది. ఇప్పుడు పాకిస్తాన్ ప్రపంచ కప్ నుండి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్తాన్ ఆదాయంపై కూడా ఐసిసి నిషేధం విధించవచ్చు. నివేదికల ప్రకారం, ఐసిసి ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 316 కోట్ల రూపాయలు) ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నిలిచిపోతే పాకిస్తాన్ పూర్తిగా దివాలా తీసినట్లే. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, పాకిస్తాన్ జట్టు జియోస్టార్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి రావచ్చు. ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ద్వారా అత్యధికంగా సంపాదన వస్తుంది. ఈ మ్యాచ్‌లో 10 సెకన్ల ప్రకటన స్లాట్ సైతం చాలా ఖరీదైనది. మ్యాచ్ జరగకపోతే వారికి చాలా నష్టం వాటిల్లుతుంది. పాకిస్తాన్ మీద ద్వైపాక్షిక సిరీస్‌లపై కూడా పూర్తి నిషేధం విధించవచ్చు. ఈ నిషేధంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మరింత దివాళా తీస్తుంది. ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ పాకిస్తాన్ సూపర్ లీగ్ లో సైతం నష్టపోవచ్చు. వాస్తవానికి, టోర్నమెంట్ కోసం విదేశీ ఆటగాళ్ల ఎన్‌ఓసి అంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌పై నిషేధం విధించవచ్చు. భారత్ తో మ్యాచ్ లు ఆడకూడదనే నిర్ణయం గురించి పిసిబి ఇంకా ఐసిసికి తెలియజేయలేదని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బహిష్కరణను పిసిబి అధికారికంగా ఐసిసికి తెలియజేసిన తర్వాతే చర్యలు చేపడుతుంది.. 2026 టి 20 ప్రపంచ కప్ నుండి పాకిస్తాన్ ను మినహాయించవచ్చు అని ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ టి 20 లీగ్ (పిఎస్ఎల్) లో విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసిలు ఇవ్వడానికి కూడా ఐసిసి నిరాకరించవచ్చు. బంగ్లాదేశ్ ను వెనకుండి ప్రోత్సహించిన కారణంగా, వారికి ఓ న్యాయం, తమకు ఓ న్యాయం ఉండదని చెప్పడానికి.. బంగ్లా దారిలో పయనించి పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఐసిసి షెడ్యూల్ ప్రకటించిన తర్వాత తమ మ్యాచ్ లను భారత్ వెలుపల తరలించడానికి నిరాకరించిన తరువాత టి 20 ప్రపంచ కప్ లో పాల్గొనకూడదని బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీని తరువాత, పాకిస్తాన్ ఆటగాళ్ళు, పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ ఐసిసిని విమర్శించారు. టోర్నమెంట్ ను బహిష్కరిస్తాం అన్నారు. అయితే, సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో మ్యాచ్ ఉంటే ఏం చేయనున్నారో పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. అప్పుడు వారు ఆడతారా లేదా? ప్రస్తుతం పాక్ ప్రభుత్వం ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మాత్రమే ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది.

# ఇండియా-ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ



టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా సన్నాహకాల్లో భాగంగా రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం బీసీసీఐ సోమవారం (ఫిబ్రవరి 2) ఇండియా-ఎ జట్టును ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మ రీ-ఎంట్రీ ఇవ్వడం, ఐపీఎల్ స్పీడ్ స్టార్ మయాంక్ యాదవ్ జట్టులోకి రావడం ఈ స్క్వాడ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమిండియా తన సన్నాహకాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అమెరికా, నమీబియాతో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ, యువ రక్తాన్ని పరీక్షించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి జట్టు పగ్గాలను అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న బదోనికి ఇది ఒక పెద్ద అవకాశం. తెలుగు క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. గాయం కారణంగా కొన్నాళ్లు దూరమైన తిలక్ వర్మ జట్టులోకి తిరిగొచ్చాడు. సర్జరీ తర్వాత కోలుకున్న తిలక్, ఫిట్‌నెస్ టెస్ట్ పాసై జట్టులో చేరాడు. అయితే ఇందులో ఒక చిన్న ట్విస్ట్ ఉంది. తిలక్ వర్మ ఇండియా-ఎ తరపున కేవలం ఒకే ఒక్క వార్మప్ మ్యాచ్ ఆడతాడు. ఆ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాత నేరుగా టీమిండియా(సీనియర్ జట్టు)లో చేరి వరల్డ్ కప్ ఆడతాడు. ఇది తిలక్ కెరీర్‌కు అత్యంత కీలకమైన సమయం. ఐపీఎల్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో ఆడిన తర్వాత గాయపడిన మయాంక్, సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. అతని వేగం టీమిండియాకు రాబోయే రోజుల్లో పెద్ద ఆస్తి కానుంది. మయాంక్ తో పాటు ఖలీల్ అహ్మద్, రవి బిష్ణోయ్ వంటి సీనియర్ బౌలర్లు కూడా ఈ జట్టులో ఉండటం విశేషం. ఇక రెండో మ్యాచ్ ఫిబ్రవరి 6 (శుక్రవారం) నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచుల ద్వారా యువ ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలించి, అవసరమైతే మెయిన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి ఎవరినైనా తీసుకునే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ వంటి హిట్టర్లు ఈ జట్టులో ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

**ఇండియా-ఎ స్క్వాడ్ (వార్మప్ మ్యాచుల కోసం):**

ఆయుష్ బదోని (కెప్టెన్), నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ, ప్రియాంశ్ ఆర్య, ఎన్.జగదీశన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, రియాన్ పరాగ్, మానవ్ సుతార్, అశోక్ శర్మ, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్), గుర్జాప్నీత్ సింగ్, విప్రజ్ నిగమ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్.

# నా మాటలు వక్రీకరించారు: మేరీకోమ్



భారత ప్రముఖ బాక్సర్ మేరీకోమ్? మరోసారి తన వైవాహిక బంధం గురించి మాట్లాడింది. ఇటీవల మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్‌పై ఆరోపణలు చేసే క్రమంలో ఆమె మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా తన తన మాజీ భర్తను ఉద్దేశించి మాత్రమే చేశానని, ఇంకెవరినీ బాధపెట్టాలని చేసింది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసింది. 'చాలా ఏళ్ల పాటు మా వైవాహిక బంధం సజావుగానే సాగింది. అయితే నా భర్త తనను ఆర్థికంగా మోసగించడం వల్ల మా రిలేషన్ దెబ్బతింది. ఆ తర్వాతే మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. గతేడాది మాకు విడాకులు మంజూరైన తర్వాత నాపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా దాడి జరిగింది. అయినా నేను సంయమనం పాటించాను' 'రీసెంట్?గా ఒక టాక్‌షోలో నేను మాట్లాడిన మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించండి. ముఖ్యంగా పురుష సమాజం. ఆ మాటలన్నీ, నా వ్యక్తిగత జీవితంలో నేను అనుభవించిన బాధ నుంచి వచ్చినవే. అయితే నా మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. కానీ నేను ఏ ఆటకు కూడా వ్యతిరేకం కాదు. నేను క్రీడాకారులందర్నీ గౌరవిస్తా' అని మేరీకోమ్ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మేరీకోమ్ తన మాజీ భర్తపై ఆరోపణలు చేసింది. అతడు 'గల్లీ ఫుట్‌బాల్' ఆటగాడంటూ విమర్శించింది. 'అనేక మందిలాగే అతడు కూడా ఓ సాధారణ గల్లీ ఫుట్?బాల్ ప్లేయర్. అంతమాత్రాన అతను బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రి అవ్వలేడు. కెరీర్?లో అసలు సక్సెస్ అవ్వలేడు' అని మేరీకోమ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఇందులో 'గల్లీ ఫుట్?బాల్' అనే వ్యాఖ్యల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఇది కాంట్రవర్సీ అయ్యింది. ఈ వ్యాఖ్యలపై మేరీకోమ్ తాజాగా క్లారిటీ ఇస్తూ, క్షమాపణలు కోరింది. అయితే ఆమె మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్ ఓ ఫుట్‌బాల్ ఆటగాడు. అయితే మేరీకోమ్ కోసం తన కెరీర్‌ను సైతం వదులుకున్నానని కరుంగ్ గతంలో ఓ సందర్భంలో చెప్పారు. దీనిపైనే మేరీకోమ్ విరుచుకుపడింది. అలా మాట్లాడింది. అయితే తామిద్దరు ఢిల్లీలో కలుసుకున్నప్పటికే కరుంగ్ తన కెరీర్‌ను వదిలేశారని మేరీకోమ్ పేర్కొంది. 2005లో మేరీకోమ్- కరుంగ్ ఆంఖోలర్ వివాహం జరిగింది. మణిపూర్?కు చెందిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్?లో అనేక ఘనతలు సాధించింది. అంతర్జాతీయ వేదికల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించిన మేరీకోమ్ ఎన్నో మరపురాని విజయాలు సాధించింది. 2012లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేతగా నిలిచింది. మహిళా బాక్సర్లలో ఇంకెవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా ఆరుసార్లు వరల్డ్? ఛాంపియన్‌గా నిలిచింది. 2016 నుంచి 2022 మధ్య రాజ్యసభకు కూడా మేరీకోమ్ ప్రాతినిధ్యం వహించింది. అయితే 41ఏళ్ల మేరీకోమ్ ప్రస్తుతం బిగ్ ఈవెంట్?లలో ఆడకున్నా, రిటైర్మెంట్ తీసుకున్నట్లు మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. దేశం తరఫున ఇంకా పతకాలు సాధించాలనే ఆకలి ఉన్నట్లు గతంలో ఓ సందర్భంలో పేర్కొంది.

# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

## ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం



2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరపున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరపున అరంగేట్రం చేశాడు. మొదటి బంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అప్పుడే అతనిలో ఏదో తెలియని అద్భుతమైన ప్రతిభ ఉందని నాకు అర్థమైంది" అంటూ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నుంచి ట్రేడ్ చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని కూడా పాంటింగ్ వెల్లడించారు. "అతన్ని వదులుకోవద్దని నేను మేనేజ్‌మెంట్‌ను బతిమిలాడాను. ఒక అద్భుతమైన సూపర్‌స్టార్ తయారవుతున్నాడని చెప్పాను. ఇప్పుడు అది నిజమైంది" అంటూ తెలిపాడు. 2018 అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన అభిషేక్, ఇప్పుడు తన మొదటి సీనియర్ టీ20 ప్రపంచకప్ ఆడబోతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన 4 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 152 పరుగులతో దుమ్మురేపాడు. మూడో మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఇది టీ20ల్లో భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ. 2007లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన యువరాజ్ సింగ్ మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలనే భారత ప్రయత్నంలో అభిషేక్ కీలక పాత్ర పోషించనున్నాడు. గ్రూప్-ఏ లో ఉన్న భారత్, ఫిబ్రవరి 7న అమెరికాతో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# హుస్నాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్,జనత న్యూస్: ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 20 స్థానాలు గెలిపించి తనకు మరింత బలం ఇవ్వాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటర్లను కోరారు. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 12, 13, 14 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి మంత్రి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజాపాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గత పదేళ్లలో హుస్నాబాద్‌కు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ ఒక్క సంవత్సరంలోనే 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు, వడ్డీలేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయన్నారు.హుస్నాబాద్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తవుతున్నాయని, 250 పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. మహిళల స్వయం ఉపాధి కోసం సెట్విన్ శిక్షణ, ఎల్లమ్మ చెరువు వద్ద ఫిషరీస్ మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

# మెరుగు పేరుతో మోసం

## -ఒకరి పట్టివేత, మరొకరు పరారీ -పర్లపల్లి లో ఘటన

తిమ్మాపూర్, జనతా న్యూస్ : మెరుగు పెట్టేందుకు వచ్చి మహిళను మోసం చేసి ఒకరు దొరికి పోగా మరొకరు పరారయ్యారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లిలో ఘరానా మోసం జరిగింది. వెండి మెరుగు పెడతామని, వీడియో తీసుకోవాలని దుండగులు చెప్పడంతో వెంకటమ్మ నమ్మిన మోసపోయింది. వెండిని శుద్ధి చేస్తామని చెప్పడంతో వెంకటమ్మ 20 తులాల వెండి వస్తువుని తీసుకొచ్చి దుండగులకు ఇచ్చినది. వారు వెండిని రసాయన ద్రావణంలో కరిగించిన తరువాత ఆమె చూడగా 10తులాల వెండి మిగిలింది. వెంకటవ్వ కేకలు పెట్టగా ఒకరు పరారు కాగా, మరొకరిని గ్రామస్తులు. పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పట్టుకున్న దొంగని ఎల్ఎండి పోలీస్ స్టేషన్ కి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్





కరీంనగర్, జనతా న్యూస్: మున్సిపల్ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరగాలని తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లలో అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కౌంటింగ్ పూర్తైన అనంతరం మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం--2లను సిద్ధంగా ఉంచాలని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని ఒప్పించి డిమాండ్లను సాధించుకుందాం

## అవసరమైతేనే పోరాటాలు

## రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తమ డిమాండ్లను సాధించుకుంటామని, అవసరమైతే పోరాటాలకు సిద్ధమని, ఎవరికి లాలూచీ పడేది లేదని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా నీటి పారుదల శాఖ ఉద్యోగుల(టింగో) సర్వసభ్య సమావేశం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉద్యోగుల సేవ చేయడానికి ఉన్నట్లు తెలిపారు. ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం (టింగో)తో నూతన ఉత్సాహం వచ్చిందని, నాయకులు కష్టపడి పని చెయ్యాలని, మన కోసం మనమే కోట్లాడాలని తెలిపారు. గతంలో సంఘాలు సంఘటితంగా ఉండి కొట్లాడి సాధించుకున్నాయని, ఇప్పుడు యూనిటీ లేకుండా పోయిందని అన్నారు. రాజకీయ నాయకులు ప్రజలను మభ్య పెట్టడానికి చేస్తారని, ఉద్యోగుల విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు అలానే చేస్తున్నాయని అన్నారు. ఇప్పుడు మూడు డిఏ, సరెండర్ లీవ్ లు సాధించినట్లు, ఇంకా రావాల్సినవి వచ్చేలా బాధ్యతలు తీసుకుంటానని తెలిపారు. పైసా ఇవ్వనన్న వారితోనే 5700 కోట్లు తీసుకున్నమని తెలిపారు. మనకు 1500 కోట్లు రావాల్సినవి ఉన్నాయని, ప్రభుత్వం కొంచెం కొంచెం ఇస్తుందని అన్నారు. సంఘాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యోగులు కృషి చేయాలని కోరారు.హెచ్‌పిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి..పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డు,డిఏలను చెల్లించే వరకు కొట్లాడతామని స్పష్టం చేశారు.హెచ్చిక్కడైనా కొందరు దుర్మార్గులు ఉంటారని, వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా గంగారపు రమేష్, ఒంటెల ప్రసాద్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నిక కాగా వారిని సన్మానించారు. ఎల్ఎండీ లో ఈ నెల 15 న శివరాత్రి , 18 న శివ కళ్యాణం, అలాగే 25 వరకుహనిర్వహించే వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డ, సంగెం లక్ష్మణ్ రావు, ఎన్టీపీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకటేశ్వర రావు, లెంకల రామచంద్రా రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శంకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి,కార్యదర్శి అమరెందర్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్,కార్యదర్శి నాగరాజు, జిల్లా మహిళ నాయకులు మన్నె సరిత, దూలం ధనలక్ష్మి, నాల్గో తరగతి అధ్యక్షులు రామస్వామి, రాజయ్య, శంకర్, ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : మార్కెట్లో ప్రతీ ఒక్కరూ ఎప్పటికపుడు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అల్ట్రాటెక్ కంపెనీ ప్రతినిధి ఇంద్రనీల్ చటర్జీ అన్నారు. శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి రెండు రోజుల టెక్నికల్ ఫెస్ట్ ను సోమ వారం శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్ట్రాటెక్ కంపెనీ ప్రతినిధి ఇంద్రనీల్ చటర్జీ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విభాగము చాలా ప్రాముఖ్యమైనదని అన్నారు. భవన నిర్మాణాలు డిజైన్ చేయడంలో పై నుండి కిందికి, నిర్మాణం చేయడంలో కింద నుండి పైకి మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించినటువంటి పోస్టర్ ప్రజెంటేషన్, టెక్ ఎక్స్పో, పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, బ్రిడ్జ్ మోడల్, స్మార్ట్ సిటీ మోడల్, మేక్ మై కాంక్రీట్ మొదలగు సాంకేతిక ఈవెంట్స్ నూతన ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉన్నాయని తెలియజేశారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని ఒకరి నుండి ఒకరికి పంచుకొనుటకు వీలు కలుగుతుందని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రజెంట్ చేసిన పోస్టర్స్, ప్రతి ఈవెంట్ కూడా ఏదో ఒక కొత్త లోచనలను ప్రతిబింబించే విధంగా ఉన్నాయని, వారి యొక్క కృషి ప్రశంశ నియమైనదని తెలియజేశారు



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ యొక్క టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించడం వలన విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్స్ మరియు విద్యార్థులు తయారుచేసిన మోడల్స్ వలన నూతన సాంకేతిక అంశాలు అందరికీ క్లుప్తంగా అర్థమయ్యే విధంగా ఉన్నాయని విద్యార్థులను ప్రశంసించారు. ఇతర కళాశాలల నుండి దాదాపు 300 మంది విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్ మొదలగు వాటిలో పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసినటువంటి మోడల్స్ నూతన సాంకేతికపరమైన అంశాలను తెలియజేసే విధంగా ఉన్నాయని తెలిపారు. వారు తయారు చేసినటువంటి మోడల్స్ అతిథులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయని మరియు అతిథులు అడిగిన ప్రశ్నలకు కూడా విద్యార్థులు మోడల్స్ గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ఎం. శ్రీరామ్ చంద్, ఏఓ పారువెల్ల రామారావు, మీడియా ఇంచార్జ్ గొంటి రమేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సీపీ సమీక్ష



కరీంనగర్, జనతా న్యూస్: ఈ నెల 5న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా పర్యటనను పురస్కరించుకుని ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ సభా ప్రాంగణం, హెలిపాడ్, పార్కింగ్ ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణ మ్యాప్ ఆధారంగా భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించిన సీపీ, బారికేడ్ల ఏర్పాటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, భౌగోళిక పరిస్థితులపై ఎమ్మెల్యేకు వివరించారు. సభకు వచ్చే వాహనాల రాకపోకల కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీపీ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇంటి పన్ను పెంపునకు కాంగ్రెస్ ప్లాన్


## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్, జనతా న్యూస్: మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇంటి పన్ను పెంచి ప్రజలపై భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇప్పటికే సిద్ధమయ్యాయని చెప్పారు. ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టో పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్‌కు నయాపైసా కూడా ఇవ్వలేదని, అలాంటి పరిస్థితుల్లో ఓట్లు అడగడానికి కాంగ్రెస్ నేతలకు ఏ అర్హత ఉందని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కబ్జాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి తెస్తుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరిగిందని స్పష్టం చేశారు. తాను కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తే, బీఆర్ఎస్ నేతలు అవే తమవని చెప్పుకుంటున్నారని విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తీసుకొచ్చి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కరీంనగర్‌కు నయాపైసా తీసుకురాలేదని నిరూపిస్తే తాను నగరం వదిలి వెళ్లిపోతానన్న మాజీ మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ, తాను తెచ్చిన నిధుల వివరాలతో బుక్‌లెట్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆ బుక్‌లెట్‌లో కరీంనగర్ కోసం తెచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు ఉన్నాయని, ఐదు లక్షల కాపీలు ముద్రించి ఇంటింటికీ పంపిస్తున్నామని చెప్పారు.



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బండి సంజయ్ కిసాన్‌నగర్, కాపువాడ మారుతీనగర్ చౌరస్తాలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారా స్మార్ట్ సిటీ సహా పలు పథకాల కింద వందల కోట్ల నిధులు తీసుకొచ్చామని, నీటి సరఫరా కోసం రూ.134 కోట్లు, ఇటీవల మరో రూ.50 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. ఎన్నికలు ముగిసిన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేస్తే కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించే ప్రమాదం ఉందని, నిధులు తెచ్చేది బీజేపీయేనని అన్నారు. బీజేపీకి మేయర్ పీఠం అప్పగిస్తే కార్పొరేటర్లతో కలిసి ప్రధాని మోదీని కలిసి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ అభ్యర్థులపై అవినీతి ఆరోపణలు లేవని, కరీంనగర్ అభివృద్ధికే వారు కట్టుబడి ఉన్నారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి నిజాయితీగా పనిచేస్తానని బండి సంజయ్ ప్రజలను కోరారు.

# తహశీల్దార్ సంతకాలు పోర్జరీపై విచారణ చేయాలని కలెక్టర్‌కు వినతి


తేది. 2-2-202
శ్రీయుత గౌరవ నీయులైన జిల్లా కలెక్టర్ రాజన్నసిరిసిల్ల జిల్లా గారికి ..
అయ్యా..!
విషయం - తహశీల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి వ్యవసాయ భూములను పహాణీలో నమోదు చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం గురించి ..
E. harish Reddy
సెల్. 8985257207
COLLECTOR OFFICE
02 FEB 2026
RAJANNA SIRICILLA DIST.

కరీంనగర్, జనతా న్యూస్ । ఫిబ్రవరి 02, 2026: తహశీల్దార్ సంతకాలు పోర్జరీ చేసి వ్యవసాయ భూములను పహాణీలో అక్రమంగా నమోదు చేశారంటూ తమ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామానికి చెందిన హరీష్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. తన ఫిర్యాదులో హరీష్ రెడ్డి పేర్కొంటూ, వంతడుపుల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 560, 602, 551, 568, 598/6లకు సంబంధించిన ప్రభుత్వ భూములను పహాణీ, 1బి రికార్డుల్లో తప్పిదంగా నమోదు చేశారనే ఆరోపణలు చేశారు. బత్తిని ఎల్లయ్య (తండ్రి: కుశాలు) అనే వ్యక్తి అప్పట్లో విధులు నిర్వహించిన ఎమ్మార్వో సంతకాలను పోర్జరీ చేసి పహాణీలు, ప్రొసీడింగ్స్ తయారు చేసుకున్నారని తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ నమోదుల ఆధారంగా రైతుబంధు లబ్ధి పొందడంతో పాటు బ్యాంకు రుణాలు కూడా తీసుకున్నట్లు తనకు అనుమానం ఉందని హరీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై పరిశీలన జరిపిన రాజన్నసిరిసిల్ల ఆర్డీవో సంబంధిత సర్వే నెంబర్లలో డిలీషన్ చేసినట్లు తనకు సమాచారం అందిందన్నారు.అయితే జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు అక్రమ పాస్‌బుక్స్, ప్రొసీడింగ్స్ తయారు చేసి తహశీల్దార్ సంతకాలు పోర్జరీ చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై కేసు నమోదు చేయాలని సూచించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లంతకుంట తహశీల్దార్ కేసు నమోదు చేయడానికి నిరాకరించారని, పోలీసులు కూడా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎమ్మార్వో ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదు చేయవచ్చని చెప్పారని ఆయన తెలిపారు. తహశీల్దార్ సంతకం పోర్జరీ వంటి తీవ్రమైన అంశంపై కూడా అధికారులు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం కూడా సర్వే నెంబర్ 560లో అక్రమంగా కాస్తు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను హరీష్ రెడ్డి కోరారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వొడితల ప్రణవ్ జోరు



హుజూరాబాద్, జనతా న్యూస్: హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్తోంది. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు గత రెండేళ్లలో ఎలా జరిగాయో వివరంగా తెలియజేస్తోంది. హుజూరాబాద్ పట్టణంలోని 26 వార్డుల పరిధిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు విశేష స్పందన తెలుపుతూ బ్రహ్మరథం పట్టారు. ఈసారి పక్కాగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని పలువురు హామీ ఇచ్చారు. ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తే మరింత బాధ్యతగా పట్టణ అభివృద్ధి చేపడతామని వొడితల ప్రణవ్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తలకే కమలం పెద్ద పీట

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల జాబితా ఖరారైంది. మొత్తం 66 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సోమవారం మీడియాకు విడుదల చేశారు. విడుదలైన జాబితాను పరిశీలిస్తే సుమారు 80 శాతం మంది పార్టీ కార్యకర్తలకే కార్పొరేటర్ టిక్కెట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ప్రచారం పూర్తిగా నిరాధారమని ఈ జాబితాతో స్పష్టమైంది. పార్టీని నమ్ముకుని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఈసారి పెద్దపీట వేయడం గమనార్హంగా మారింది. గెలిచే అవకాశం తక్కువగా ఉన్న డివిజన్లలో మాత్రమే ఇతర పార్టీల నుంచి వచ్చిన మాజీ కార్పొరేటర్లు, ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకులకు ప్రత్యామ్నాయంగా టిక్కెట్లు కేటాయించారు. టిక్కెట్ల కేటాయింపులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్కడా జోక్యం చేసుకోలేదని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. టిక్కెట్ల ఖరారుకు జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు, ఓదేలు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డివిజన్ల వారీగా సర్వేలు నిర్వహించి, వివిధ సర్వే ఏజెన్సీల నివేదికలు, కార్యకర్తల పనితీరును పరిగణనలోకి తీసుకుంది. గత వారం



రోజులుగా డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసిన కమిటీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపింది. ఆ జాబితాను పరిశీలించిన అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అధికారికంగా అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు.

# కరీంనగర్‌లో బీఆర్ఎస్ విజయం రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుంది

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే ప్రభావం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై మొత్తం కనిపిస్తుందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని శ్వేత హోటల్‌లో బీఆర్ఎస్ పార్టీ 66 డివిజన్ల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హాజరై డివిజన్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్లలో కరీంనగర్‌కు రెండు రూపాయలు కూడా తీసుకురాలేదని విమర్శించారు. రాబోయే మూడేళ్లలోనూ వారు అభివృద్ధి చేయలేరన్న భావన ప్రజల్లో బలంగా ఏర్పడిందని, అందుకే ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని, పదేళ్ల పాటు దేశంలోనే తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం ప్రజల్లో పెరిగిందన్నారు. గతంలో ఎవరితోనూ పొత్తు లేకుండా కరీంనగర్ మేయర్ పీఠాన్ని టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి కూడా ఎలాంటి



పొత్తులు లేకుండా మేయర్ పీఠాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగరంలో 90 శాతం రోడ్లు పూర్తిచేశామని, అనేక ప్రాజెక్టులను నగరానికి తీసుకువచ్చామని తెలిపారు. ఈ అభివృద్ధిని ప్రజలు గుర్తించి బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్‌కు ప్రత్యేక చరిత్ర ఉందని, ఇక్కడి నుంచే కేసీఆర్ ఉద్యమం ప్రారంభమై తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. కరీంనగర్‌లో విజయం సాధిస్తే అది రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రతి డివిజన్ ఇన్‌చార్జి కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా కష్టకాలంలో తోడుగా ఉన్న వారిని పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల్లో ఇప్పటికే 60 మందికి బీ-ఫారాలు ఇచ్చామని, ఒక్కో డివిజన్‌లో ఒక్కరే పోటీలో ఉండేలా చూసామని తెలిపారు. అందరూ ఐక్యంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల్లో మాత్రం ఎవరికీ బీ-ఫారం దక్కుతుందో తెలియక అంతర్గతంగా గొడవలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గెలిచిన తరువాత పార్టీ వీడను: బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థుల ప్రతిజ్ఞ



కరీంనగర్, జనతా న్యూస్: అయారాం--గయారాం సంస్కృతితో రాజకీయాలు అపహాస్యంగా మారుతున్న ఈ తరుణంలో, కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వినూత్న రీతిలో ప్రతిజ్ఞ చేయించారు. గెలిచిన తరువాత పార్టీని వీడనని, బీజేపీలోనే కొనసాగుతూ అంకిత భావంతో ప్రజాసేవ చేస్తామని అభ్యర్థులు ప్రమాణం చేశారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో అభ్యర్థులు---ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, కరీంనగర్ అభివృద్ధితో పాటు దేశం, సమాజం, ధర్మం కోసం పనిచేస్తామని---స్పష్టం చేశారు. గెలిచిన తరువాత భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతామని, ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రసక్తే లేదని దైవ సాక్షిగా, తల్లిదండ్రుల సాక్షిగా ప్రమాణం చేశారు. అభ్యర్థులు ప్రతిజ్ఞ చేస్తున్న సమయంలో అక్కడున్న ప్రజలు చప్పట్లతో అభినందనలు తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధత, నిజాయితీ, అంకిత భావంతో పనిచేస్తామని అభ్యర్థులు హామీ ఇవ్వడం విశేషంగా నిలిచింది.

## కరీంనగర్ కార్పొరేషన్‌కు బీజేపీ 66 మంది అభ్యర్థుల జాబితా విడుదల

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయనున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల జాబితాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆమోదించారు. మొత్తం 66 డివిజన్లకు గాను అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను పార్టీ రాష్ట్ర కార్యాలయం సోమవారం విడుదల చేసింది.

### బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థుల వివరాలు:

1. వార్డు--1: బారి అపర్ణ
2. వార్డు--2: కొలగాని శ్రీనివాస్
3. వార్డు--3: సాధినేని లావణ్య
4. వార్డు--4: భూపతి రవీందర్
5. వార్డు--5: చిందం హారిక
6. వార్డు--6: మేకల వెంకటేష్
7. వార్డు--7: వడే రామదేవి
8. వార్డు--8: తూర్తి సంతోష్
9. వార్డు--9: బండారి గాయత్రి దేవి
10. వార్డు--10: దేశవేని శంకర్
11. వార్డు--11: పండుగ స్వప్న
12. వార్డు--12: చొప్పరి జయశ్రీ
13. వార్డు--13: రెడ్డవెన లావణ్య
14. వార్డు--14: గుంజేటి శివకుమార్
15. వార్డు--15: సోమిరెడ్డి కరుణ
16. వార్డు--16: గిత రాజేంద్ర ప్రసాద్
17. వార్డు--17: గుంటి రమ్య
18. వార్డు--18: వాసాల రమేష్
19. వార్డు--19: మూల రుక్మిణి
20. వార్డు--20: జాడి బాల్‌రెడ్డి
21. వార్డు--21: కొండపల్లి సతీష్
22. వార్డు--22: బండా రమణ రెడ్డి
23. వార్డు--23: పదం శివరాజ్
24. వార్డు--24: వొంటెల సత్యనారాయణ రెడ్డి
25. వార్డు--25: కటకం లోకేష్
26. వార్డు--26: పుల్లెల పవన్ కుమార్
27. వార్డు--27: తంబాల నవ్య శ్రీ
28. వార్డు--28: కుర్ర రాజేశం
29. వార్డు--29: సోమిడి వేణు
30. వార్డు--30: నక్క సరితా శుభాషిణి
31. వార్డు--31: ఎండీ ఫయాజుద్దీన్
32. వార్డు--32: ఎండీ ఇనాయత్ అలీ
33. వార్డు--33: మడిశెట్టి సరిత
34. వార్డు--34: యెలగందుల నందకుమార్
35. వార్డు--35: సడవేని సుజాత
36. వార్డు--36: తోట అనిల్
37. వార్డు--37: కొడూరి ఏ.పి.పి. చంద్ర
38. వార్డు--38: దేవసాని సరస్వతి
39. వార్డు--39: పసుపులేటి శివానందం
40. వార్డు--40: కసర్ల లక్ష్మి నర్సవ్వ
41. వార్డు--41: వేనంక రేణుక
42. వార్డు--42: యాదగిరి సునీల్ రావు
43. వార్డు--43: పొన్నం లక్ష్మి
44. వార్డు--44: బండి తారా
45. వార్డు--45: గడప విజయలక్ష్మి
46. వార్డు--46: కొడూరి అఖిల్ గౌడ్
47. వార్డు--47: గాజ రమ
48. వార్డు--48: కర్ర పద్మ
49. వార్డు--49: అన్నం లక్ష్మి
50. వార్డు--50: బోయినపల్లి ప్రవీణ్ రావు
51. వార్డు--51: బండారి వేణు
52. వార్డు--52: నేదునూరి కనకలక్ష్మి
53. వార్డు--53: కొంపెల్లి శ్వేత
54. వార్డు--54: గొట్టెముకుల ఉమారాణి
55. వార్డు--55: గుగ్గిళ్లపు మంజుల
56. వార్డు--56: థాటి ప్రభావతి
57. వార్డు--57: కొలిపాక రమ్యశ్రీ
58. వార్డు--58: సర్దార్ బల్బీర్ సింగ్
59. వార్డు--59: ఎండీ సమి పర్వేజ్
60. వార్డు--60: టీ. శ్రీదేవి
61. వార్డు--61: సయ్యద్ రిజ్వానా
62. వార్డు--62: పెద్దపల్లి శ్రీలేఖ
63. వార్డు--63: దేశా శిల్ప
64. వార్డు--64: గాదె శ్రీకళ
65. వార్డు--65: కమటం తిరుపతి
66. వార్డు--66: వంగల పవన్

ఈ జాబితాను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు అధికారికంగా విడుదల చేశారు.

# విశ్వవేదికలపై రాణించేలా తెలంగాణ క్రీడాకారులకు తర్ఫీదు



కరీంనగర్, జనతా న్యూస్: క్రీడలకు సంబంధించిన ఒలింపిక్స్ వంటి విశ్వవేదికలపై తెలంగాణ క్రీడాకారులు రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతున్నారని, ఈ పరిస్థితిని మార్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పోటీ పడేలా తెలంగాణ క్రీడాకారులకు సమగ్ర శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందడుగు వేసిందని, అందులో భాగంగా ఇప్పటికే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తులో దేశానికి అత్యుత్తమ క్రీడాకారులను తెలంగాణ నుంచి అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. క్రీడా పాలసీలో భాగంగా విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగానే సీఎం కప్ పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, శంకరపట్నం ఎంపిడీవో కృష్ణ ప్రసాద్, తహశీల్దార్ సురేఖాదేవి, ఎస్ఐ శేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు గట్టు తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, జంపయ్య, గొట్టె మధు, జనగామ రాజయ్యతో పాటు ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

# చట్టం ముందు అందరూ సమానులే, కేసీఆర్‌కు మినహాయింపు లేదు: పులి ఆంజనేయులు గౌడ్



కరీంనగర్, జనతా న్యూస్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించడం తెలంగాణ ప్రజల అవమానమని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “దొంగలే దొంగ దొంగ అన్నట్లుగా ఉంది బీఆర్ఎస్ నేతల పరిస్థితి” అంటూ విమర్శలు గుప్పించారు. సిట్ అధికారుల ముందు ఎవరైనా ఒకటేనని, కేసీఆర్‌కు నష్టం జరిగితే తెలంగాణకు నష్టం జరిగినట్టేనా? కేసీఆర్‌ను ప్రశ్నిస్తే తెలంగాణను ప్రశ్నించినట్టేనా? అంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరినైనా ప్రశ్నించే హక్కు చట్టానికి ఉందని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. చట్టం ముందు కేసీఆర్ అతీథి కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. విచారణను సినిమా హాల్‌లా చూపిస్తూ ఉక్కిరిబిక్కిరి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని చూసి తెలంగాణ ప్రజానీకం నివ్వరపోయిందని, ప్రజా కవి గద్దర్, ప్రొఫెసర్ కోదండరాం వంటి ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన బాధ్యత బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకుని చట్టానికి సహకరించాలని పులి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు.

# పూరిలో జరగనున్న బీఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి




కరీంనగర్, జనతా న్యూస్: ఒడిశా రాష్ట్రం పూరిలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని బీఎంఎస్ ఆర్ఏ కార్యాలయంలో బీఎంఎస్ నేతల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పప్పుల సురేష్ మాట్లాడుతూ, బీఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశ నలుమూలల నుంచి సుమారు 2,500 మంది ప్రతినిధులు, అలాగే వివిధ దేశాల నుంచి విదేశీ ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వతంత్ర కార్మిక సంఘంగా బీఎంఎస్ గుర్తింపు పొందిందని, కార్మికుల శ్రేయస్సు కోసం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కార్మిక సంస్కరణలపై విస్తృత చర్చలు జరిపి కీలక తీర్మాణాలు తీసుకునే అవకాశం ఈ మహాసభల్లో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, నాయకులు ఆముదుర్తి రవి, శ్రీనివాస్, రంజిత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా బొప్పరాతి రవితేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ మెడికల్ రిప్రెజెంటేటివ్స్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన బీఎంఎస్ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజన పరిశీలన



సిద్దిపేట, జనతా న్యూస్ । ఫిబ్రవరి 02, 2026: గజ్వేల్ పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన అన్నం, పాలకూర పప్పు, వంకాయ--ఆలుగడ్డ--టమాటా కూరలను పరిశీలించి భోజన నాణ్యతపై సూచనలు చేశారు. పిల్లలకు భోజనం నెయ్యితో వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, సరుకులు అందిన వెంటనే నమోదు చేయాలని, ఒకేసారి రాస్తానని నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరు ప్రకారం అందరికీ సరిపడేలా రుచికరంగా వండాలని సూచించారు. పిల్లలు కూర్చున్న చోటకే వెళ్లి మరల అన్నం, కూరలు వడ్డించాలని వంట సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్, ఆహారం బాగా నమిలి తినాలని, తినేటప్పుడు మాట్లాడకూడదని, ఒక్క మెతుకు కూడా పడేయకూడదని సూచించారు. సరిపడా ఆహారం తీసుకుంటే శారీరకంగా దృఢంగా ఉంటారని, చదువుతో పాటు రోజూ ఆటలు కూడా ఆడాలని విద్యార్థులకు చెప్పారు. పిల్లలకు భోజనం, వసతి, చదువు విషయాల్లో ఎలాంటి రాజీ పడవద్దని, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు.

# పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: నగరపాలక సంస్థ కమిషనర్



కరీంనగర్, జనతా న్యూస్: పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం కమిషనర్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 11న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన వసతి సౌకర్యాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల వారిగా బూత్‌లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో విద్యుత్ సౌకర్యం, లైటింగ్, అవసరమైన ఫర్నిచర్, ర్యాకులు, పార్టీషన్లు ఏర్పాటు చేయాలని, ర్యాంపులు లేని చోట ర్యాంపుల నిర్మాణం, వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు రవాణా సౌకర్యాలు కల్పించాలని, రూట్‌ల ప్రకారం అవసరమైన బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com